# నీళ్ళు - నీళ్ళు

బేకర్ ఆయిల్ ఫీల్డు, కాలిఫోర్నియా, అమెరికాలో పన్జేస్తున్న భరతన్, శాన్ ఫ్రాన్సిస్కోలో భార్యా, రెండేళ్ళ కూతురుతో సహా రెండు రోజులు మకాం వేసి, ఇరువైపుల ఆత్మీయులకీ, వారి పిల్లలకీ పేరు పేరునా గుర్తు తెచ్చుకొని బండెడు సామాన్లూ, బోల్డన్ని డ్రస్సులూ కొన్నాడు. షీఫర్ పెన్నుల దగ్గర్నుంచి హెయిర్ పిన్నుల వరకూ, డిజిటల్ వాచీల నుంచి డిజైన్ బ్రాసరీల వరకూ, గడ్డం గీసుకొనే రేజర్ సెట్ల దగ్గర్నుంచి అట్లు తీసుకొనే గరిటల వరకూ, మాట్లాడే మరబొమ్మల దగ్గర్నించి ఎలక్ట్రానిక్ గేమ్సు వరకూ - ఒకటేమిటి, కంటికి కనిపించిందల్లా కొన్నాడు. ఓ పెద్ద డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో కొన్న నాలుగు శమ్సనైట్ పెద్ద సూట్‌కేసుల్లో వస్తువులన్నీ సర్ది, శాన్‌ఫ్రాన్సిస్కోలో విమానం ఎక్కి, టోక్యో, సింగపూర్‌ల మీదుగా మద్రాసు చేరుకొన్నారు.

రెండు హాఫ్ విస్కీ బాటిల్సూ, రెండు కార్టన్లు విదేశీ సిగరెట్లూ మద్రాసు విమానాశ్రయంలోంచి చిరునవ్వులు చిందించే చిన్న తరహా కస్టమ్స్ అధికారుల చేతుల్లో పెట్టి, వాళ్ళే దారి చూపిస్తుండగా గ్రీన్ ఛానల్ లోంచి నడుచుకొంటూ బయటపడ్డారు.

మద్రాసులో మామూలుగానే టాక్సీ వాళ్ళు మీటరు మీద బండి నడపరు. అందులోనూ విమానాశ్రయం నుంచి అంటే మరీను. అదీకాక, విదేశాల నుంచి తిరిగి వస్తే మరింతగా బిగిసిపోతారు! వచ్చినంతలో ఎంత ఎక్కువ రాబట్టగలిగితే అంత మంచిదన్న ధోరణిలో వాళ్ళు

బేరం తగ్గకపోవడంతో, ప్రయాణీకులే రాజీ పడవలసిన అవసరం వస్తుంది. భరతన్, సాధారణంగా టాక్సీ స్టాండ్ దగ్గర ఉండే పోలీసు కోసం అటూ యిటూ చూశాడు. కాని, ఎక్కడ మాయమైపోయాడో కనపడలేదు. పోలీసు లక్కణ్ణుంచి మాయమవడానికి టాక్సీ డ్రైవర్లు ఏదో ముట్టచెబుతుంటారు.

భరతన్ ఉద్దేశ్యం గ్రహించిన టాక్సీ డ్రైవర్ ఓ చిన్న బాణం విసిరాడు.

"ఏదో పిల్లలు గలవాణ్ణి సార్! అంతలేసి ఖర్చులు పెట్టుకొని, ఇంతలేసి సామాన్లు తీసుకొని విదేశాల నుంచి వచ్చారు. అసలు మేం అడక్కుండానే మీరు సంతోషంగా నాలుగు వందలివ్వవలసింది పోయి, బేరాలాడ్డం న్యాయం కాదు సార్! ఇది మీకేపాటి ఖర్చు?!"

'వెధవది, నాలుగు వందలంటే జస్ట్ పది డాలర్లు!' అనుకొంటూ, భరతన్ సరేనన్నాడు. ఎయిర్‌పోర్టుకి రిసీవ్ చేసుకోవడానికివచ్చిన తమ్ముళ్లిద్దరి సహాయంతో మొత్తం సామానంతా పై కేరెజీ మీదా, వెనకాల డిక్కీలోనూ సర్ది, అడయారు ఆరో నెంబరు వీధిలో ఉన్న యిల్లు చేరే సరికి, గుమ్మం మెట్ల దగ్గర నిల్చున్న తల్లి, పెద్ద వదినా కనబడ్డారు. ముందుగా దిష్టి తీసి, ఆ తర్వాత హారతిచ్చి వాళ్ళని లోపలికి తీసుకు వెళ్ళింది భరతన్ తల్లి.

భరతన్ అందర్నీ పలకరించి, తండ్రి పక్కన సోఫాలో కూర్చుంటూ, "అమ్మా ముందస్తుగా నీ చేత్తో ఫిల్టర్ కాఫీ యివ్వు" అన్నాడు.

"మా నాయనే" అంటూ తల్లి వంటింట్లోకి దారి తీసింది.

సామాన్లనన్నింటినీ తీసుకొచ్చి హాలు మధ్యలో కుదేశారు తమ్ముళ్లిద్దరూ. పిల్లలూ పెద్దలూ ఆ సూట్‌కేస్‌లకేసి, రంగు రంగుల హేండ్‌బాగ్‌లకేసి కళ్లింతగా చేసుకొని చూడసాగారు. ఆఖరి చెల్లెలు అన్న పక్కన కూర్చుని,"అన్నయ్యా నాకేం తెచ్చావు?" అని అడిగింది నిర్మొహమాటంగా. పెద్దన్నయ్య రెండో కూతురూ,రెండో అన్నయ్య మూడో కొడుకూ, "బాబయ్యా, మాకేం తెచ్చావు?" అని అడిగారు కాస్త ధైర్యం కూడదీసుకొని.

"వాణ్ణి కాస్త కుదుట పడనివ్వండి. తర్వాత చూద్దురుగాని," అంది భరతన్ తల్లి, కాఫీ గ్లాసులతో వస్తూ. భరతన్ లేచి ఓ గ్లాసందుకుని "ఈ కాఫీ తాగేవరకూ కాస్త ఓపిక పట్టండి" అంటూ కాఫీని నెమ్మది నెమ్మదిగా ఊదుకొంటూ, ప్రతి గుక్కనీ ఆస్వాదిస్తూ త్రాగాడు.

భరతన్, అతని భార్యా శాంతా నిండు గర్భిణుల్లా ఉన్న పెట్టెల ముందు కూర్చుని, మూడింటికి తాళాలు తీసి, జిప్‌లు తీసేసరికి కుక్కి సర్దిన కొన్ని వస్తువులు కిందపడ్డాయి. నాలుగో పెట్టి ఎందుకు తెరవలేదు? అన్నట్టుగా చూసింది పెద్దక్క. ఆ చూపులోని భావం గ్రహించాడు భరతన్.

"ఈ మూడు సూట్‌కేస్‌ల్లోని వస్తువులన్నీ మీ అందరి కోసం. ఆ నాలుగో పెట్టిలోని సామాన్లు శాంతా వాళ్ళ వాళ్ళ కోసం కొన్నవి" అన్నాడు జనాంతికంగా, అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరమే మేలన్నట్లుగా.

"అదేమిట్రా భరత్. అలాగంటావు?! నీకు నీ భార్య వైపు వాళ్ళు కూడా విధాయకమే!" అంది తల్లి, కొడుకు యిబ్బంది కాస్త గ్రహిస్తూ.

భరతన్ ఒక్కొక్క వస్తువునీ తీస్తూ దాని మీద ఉన్న చీటిని చూస్తూ పేరు చదువుతూ అందించసాగాడు.

"ఇదిగో ఇది పెద్ద వదినకి, హెయిర్ డ్రైయర్ ఇది రెండో వదినకి. ఎలక్ట్రానిక్ హెయిర్

కర్లర్ - ఇది పెద్దక్కకి, పెరుగు చేసుకొనే మిషను - ఈ డ్రెస్సు రెండో అక్క మొదటి కూతురు మాలినికి.... ఇదిగో, చివరగా ఈ మేకప్ సెట్ వసంతకి. కొనేటప్పుడు ఒకరికి ఎక్కువా, మరొకరికి తక్కువా అని ఆలోచించలేదు కాని, ఇవి మీకందరికీ నచ్చుతాయి, ఉపయోగపడ్తాయి అనే ఆలోచించాను"

"తమ్ముడూ అదేంమాట? నీ అభిమానం కొద్దీ ఇంత మందికీ పేరు పేరునా ఏవో కొని తెచ్చావు. అదే చాలు మాకు" అంది రెండో అక్క.

భరతన్, మధ్యలో ఓ నాలుగంగుళాల వ్యాసముండి., పదంగుళాల పొడుగున్న గుండ్రటి ఎర్ర ప్లాస్టిక్ డబ్బాని ఓ పక్కన పెట్టడం గమనించిన వసంత, "అన్నయ్యా, అదేమి"టని ప్రశ్నించింది.

"చూపిస్తానుండు", అంటూ భరతన్ డబ్బా మూత తీసి, ఓ రంధ్రం గుండా అరంగుళం బయటకు కనిపిస్తున్న తెల్లటి ఉల్లిపొర కాయితాన్ని పట్టుకొని బయటకు లాగాడు. చేతి రుమాలు సైజు పేపరు పర్రున చిరిగి బయటకు రావడం, హాలంతా లవండర్ వాసన వెయ్యడం జరిగింది. భరతన్ ఆ కాయితంతో మొహం తుడుచుకుంటూ, "ఇందుకూ!" అన్నాడు.

వెంటనే వసంతతో సహా పిల్లలందరూ తమ తమ చేతుల్లోని వస్తువుల్ని వదిలి ఒక్కసారిగా ఆ డబ్బా మీద పడ్డారు.

"ఏమిటిది? ఆగండాగండి!" అరిచాడు భరతన్.

"ఏమిటా? రెండు రోజుల్నించీ నీళ్ళు లేక స్నానాలు లేవు!" అంది వసంత, అన్న భరతన్ చేతిలోని డబ్బాని అందరికంటే ముందుగా హస్తగతం చేసుకొంటూ.

"ఓవర్‌హెడ్ టాంక్‌లోని నీళ్ళు అయిపోయాయా?" భరతన్ ప్రశ్నించాడు.

"కిందనున్న సంప్‌లోకి మున్సిపాలిటీ వాళ్ళ నీళ్ళొస్తే కదా, మోటారు వేసి పైకి ఎక్కించడానికి! రెండు రోజులకోమారు నీళ్ళు వదుల్తున్నారు - అదీ ఓ గంటా, గంటన్నరా! ధార కూడా సన్నం!" అన్నాడు తమ్ముడు.

"మరి రోజులెలా గడుస్తున్నాయి?"

"వంటకని, త్రాగడానికని అమ్మ ఆరు స్టీలు బిందెల నిండా నీళ్ళు జాగ్రత్త చేసింది. టాయ్‌లెట్‌లో పెద్ద అవసరానికని ఓ డ్రమ్‌లో సగం నీళ్ళున్నాయి. వాటితో స్నానం చేసేస్తే, అంతే సంగతి మరి?" అంది వసంత.

"నీళ్ళ టాంకర్ ఏదైనా మాట్లాడలేకపోయారా?"

"ఇప్పటికప్పుడే రెండుసార్లు అయిదేసి వందలిచ్చి తెప్పించాం. వాడు మొన్నట్నుంచీ ధర ఏడు వందలకి పెంచేశాడు. ఎందుకంటే, నగరంలోని నూట యిరవైకి పైగా కార్పొరేషన్ వాళ్ళ బోరింగులు ఎండిపోయాయి. కార్పొరేషన్ రిజర్వాయర్ నుంచి నీళ్ళు నింపి తీసుకురావడానికి రెండు వందలు లంచం ఇవ్వాలి. అంతా కలిసి ఏడు వందలు. ఈ సాయంత్రం వరకూ మునిసిపల్ టాప్ వదలకపోతే టాంకర్‌కి కబురంపుతాను. అర్ధరాత్రి వచ్చి సంప్ నింపుతాడు" అన్నాడు భరతన్ తండ్రి.

"అదీ కాక, మేడ మీద అద్దెకున్నవారు వంటింట్లో టాప్ కట్టడం మరిచిపోయి, ఇంటికి తాళం వేసుకొని సెలవులకని వాళ్ళ ఊరెళ్ళిపోయారు. అందుమూలాన కూడా నీటి యిబ్బంది

ఏర్పడింది" తల్లి అంది.

"వాళ్ళు తాళాలిచ్చి వెళ్ళలేదా?"

"లేదు. వాళ్ళు అనుమానం మనుషులు!"

"పై డాబా మీది టాంక్ నుంచి మేడ మీది వాటాకి, మన కింది భాగానికి వేరు వేరు గొట్టాలు లేవు. తమ్ముడూ, నువ్వెళ్లి ఓ ప్లంబర్ని వెంట పెట్టుకురా. లైన్లు విడదీసి రెండు వాల్వులు పెట్టిస్తే ఇలాటి నీటి వృథా తగ్గుతుంది. అంతా ఓ గంట పని. సాయంత్రం నీళ్ళొచ్చే ముందు, లేదా రాత్రి టాంకర్ వచ్చే ముందు ఈ పనైపోవాలి. ఊఁ త్వరగా కదులు!" అన్నాడు భరతన్.

తమ్ముడు లేచి బయటకు వెళ్ళాడు.

"వాడికి తట్టినట్టు మీకెవరికీ తట్టలేదు! ఎందుకూ, ఇంతమంది ఉండి ప్రయోజనం?" అంది తల్లి అవకాశం ఉపయోగించుకుంటూ.

"మునిసిపల్ కుళాయి వస్తున్న సమయంలో గబగబా అందరూ స్నానాలు అవీ చేసేస్తే యింత యిదిగా ఉండేది కాదు. కుళాయి ఆగిపోయిన తర్వాత, ఎవరి మట్టుకు వారు తీరుబడిగా స్నానాలకుపక్రమిస్తే ఇలాగే ఉంటుంది మరి?" భరతన్ తండ్రి కూడా ఓ విసురు విసిరాడు.

"రాక రాక అమెరికా నుంచి ఇన్నేళ్ళ తర్వాత వస్తే, స్నానం చెయ్యడానిక్కూడా నీళ్ళు లేవు! మీ మామగారు ఏలూరు, ఎ.పి.లో పన్జేస్తున్నారు కదా, వెంటనే బయలుదేరి అత్తారింటికి పో!" అంది పెద్దక్క నవ్వుతూ.

"అక్కా నువ్వు నాలుగు రోజుల క్రితం 'హిందూ' పేపరు చదవలేదనుకుంటాను. ఏలూరు కాలువ అధ్వాన్న పరిస్థితిని గురించి ఫోటోలతో సహా పేపర్లో వచ్చింది. ఏలూరు ఊరి పొడుగునా కాలవ రెండు గట్ల మీదా వందలాది గుడిసెల్లో వేలాది ప్రజలు నివసిస్తున్నారు. కాలవలోని నీరు చాలా కలుషితంగా తయారైంది. కుళాయి చెరువులో నిలవున్న నీటితో ఈ వేసవి గడపడం ఏలూరు వాసులకి సాధ్యం కాని పని. చుట్టూ ఉన్న పంట భూముల్లో లెక్కకు మించి బోరింగులు దింపడం వల్ల భూగర్భంలో జలమట్టం మరింత లోతుకు పోయి, ఇళ్ళలోని బోరింగు చేతి పంపులు ఎండిపోయాయి. మూడు వందల అడుగుల లోతుకు పోతేనే కాని నీళ్ళందటం లేదు.

ఏ నీటి సదుపాయమూ లేని ప్రజలు మునిసిపల్ వీధి కుళాయిల ముందు పడిగాపులు పడి కూర్చుంటున్నారు. యింట్లో మునిసిపల్ కుళాయిలున్నవాళ్ళు ఎత్తు తగ్గించి, గోతులు తవ్వించి, చెంబూ తప్పేలాలతో సహా నీళ్లు నింపుకుంటున్నారు. బయటి వాళ్ళొచ్చి మీద పడ్తారేమోనని, నీళ్లొచ్చే సమయానికి గేట్లకి తాళాలు వేసేసుకుంటున్నారు! ఏం శాంతొదినా, ఏలూరు వెడ్తారా, ఇక్కడే ఉంటారా?" – వసంత ఏలూరు వివరాలు చెప్పి ఆ తర్వాత ఓ చిన్న విసురు విసిరింది.

శాంత చిన్నగా నవ్వి, ఊరుకొంది.

భరతన్ ఆలోచనలో పడ్డాడు. గతంలోని కొన్ని సంఘటనలు జ్ఞాపకానికొచ్చాయి.

ఉత్తర గుజరాత్ మెహసానా జిల్లాలోని ఓ ముడి చమురు స్థావరంలోని యంత్రాన్ని పరీక్షించే నిమిత్తం వెళ్తున్న సమయంలో భరతన్ ప్రయాణిస్తున్న జీప్ యింజను వేడెక్కిపోయింది. అటు

మట్టీ, యిటు యిసుకా కాని రోడ్డు కిరువైపులా బ్రహ్మజెముడు డొంకలు. ఎడారి ముళ్ళ మొక్కలు. నడినెత్తిన మండుటెండ. కాస్త దూరంలో కనిపిస్తున్న ఓ మర్రిచెట్టు నీడలోకి జీప్‌ని నడిపి ఆపాడు డ్రైవర్ దినేష్‌భాయి. వందడుగుల దూరంలో మరో మర్రిచెట్టు. దాని నీడలో ఓ బావి. ఆ చెట్టుకి ఎడంగా పాతిక దాకా మట్టి గోడలతో కట్టిన చిన్న చిన్న యిళ్ళు.

భరతన్, దినేష్‌భాయి జీప్ దిగి నడుచుకుంటూ వెళ్ళి, బావిలోకి తొంగి చూశారు. ఎండిపోయి ఉంది. చెట్టు నీడలో ఓ  ఎనభై ఏళ్ళ ముసలి అవ్వ ముగ్గురు పిల్లల్ని అడిస్తూ కూర్చుంది. దినేష్‌భాయి సందేహిస్తూనే ఓ చిన్న బాల్చీడు నీళ్ళు కావాలని అడిగాడు.

ఆ ముసలి అవ్వ కాస్త దీనంగా నవ్వి అంది :

"మీరే చూశారుగా, బావిలో నీళ్ళెండిపోయాయి. ముగ్గురు  కోడళ్ళూ రెండేసి బిందెలతో మూడు కిలోమీటర్లు దూరం ఉన్న పక్క ఊరికి, ఇప్పటికి నాలుగు రోజుల్నించీ, ప్రతిరోజూ నడిచి వెళ్ళి, నీళ్ళతో తిరిగి వస్తున్నారు. ఆ ఊరి ప్రజలు ప్రతిరోజు తగువు పెడ్తూంటే, కాళ్ళా వేళ్ళా పడి తీసుకొస్తున్నారు. ఇవ్వాళ వెళ్ళి ఇప్పటికే చాలా సేపయింది. ఎప్పుడొస్తారో ఏమో? యిందాకట్నించీ పిల్లలు దాహమంటూ ప్రాణాలు తీస్తున్నారు. కుండలో అడుగంటిన నీళ్ళతో కాస్త కాస్త గొంతులు తడుపుతున్నాను. ఈ పూట నీళ్ళు దొరక్కపోతే, రాత్రికి వంట మాట దేముడెరుగు కాని, పెదాలకి రాసుకోడానిక్కూడా నీళ్ళ చుక్కలుండవు!"

భరతన్ మాట్లాడలేకపోయినా, ఆ మాత్రం గుజరాతీ అర్థం చేసుకోగలడు. ఒకవేళ మాట్లాడగలిగినా ఏం సమాధానం చెప్పగలడని?

ఆలోపుగా వాళ్ల కంపెనీ వాళ్ళదే, ఎదురు దిశలో మరో జీప్ వస్తూండడం చూసి, చెయ్యెత్తి దాన్ని ఆపారు. భరతన్ కొలీగ్ రామ్ సక్సేనా ఆ జీప్‌లోంచి దిగి, "అరే భరతన్, ఏమైంది?" అని అడిగాడు. భరతన్ సంగతి వివరించాడు. అదృష్టవశాత్తు సక్సేనా డ్రైవరు కొంత జాగ్రత్త మనిషి. ఎప్పుడూ ఓ అయిదు లీటర్ల నీళ్ళ కాన్ జీప్‌లో ఉంచుకొంటాడు. ఆ నీళ్ళని తమ జీప్‌లోని రేడియేటర్లో పోయించి, మిగిలిన ఓ లీటరు నీళ్ళు ఆ ముసలి అవ్వ తెచ్చిన అల్యూమినియం గిన్నెలో పోయించి సక్సేనాకి, ఆ డ్రైవర్‌కి థాంక్స్ చెప్పి భరతన్ సైట్ చేరుకున్నాడు. దారిలో రెండేసి బిందెలు నెత్తిన బరువుగా మోసుకొంటూ వస్తున్న ఓ పదిహేను మంది స్త్రీలు కనపడ్డారు.

భరతన్ అహ్మదాబాద్ తిరిగి వెళ్ళి, ప్రాజెక్టు మేనేజర్‌తో మాట్లాడి, కష్టం మీద ఒప్పించి, సైట్లకి నీళ్ళని తీసుకుపోయే టాంకర్లు ఆ కుగ్రామం దగ్గర ప్రతి రోజూ ఆగి, ఆ యిళ్ళలోని బిందెలు  నింపే ఏర్పాటు చేశాడు. భరతన్ ఉద్యోగం వదిలి వెళ్ళిపోతున్నప్పుడు, ఆ ఊరి ప్రజలు కొరత లేకుండా కన్నీళ్ళు నింపుకొని వీడ్కోలు చెప్పారు.

మరో అనుభవం కళ్ళ ముందు కదలాడింది.

కలకత్తా నగరం పొలిమేరల్లో సోనార్‌పూర్ అనే చోట లెవెల్ క్రాసింగ్ దగ్గర ఓసారి భరతన్ ఆగాడు. గేటు మూసి ఉండడం వల్ల, పక్కనే చిన్న రేకు షెడ్డు హోటలు. భరతన్ తనకీ, డ్రైవర్‌కీ రెండు టీలు  కలపమన్నాడు.

రాక్షసి బొగ్గు మట్టిపొయ్యి మీద ఉన్న పెద్ద అల్యూమినియం గిన్నె మీది మూత తీశాడు హోటలతను. అందులో కందిపప్పు ఉడుకుతోంది. పప్పుతోబాటు కొన్ని కోడిగుడ్లు కూడా

ఉడుకుతున్నాయి. ఓ పింగాణి మగ్గుతో ఆ మరుగు నీళ్ళు తీసి, టీ పొడుం వేసి గుడ్డ సంచిలో పోశాడు. దిగిన డికాక్షన్‌లో, పొయ్యి సెగనే ఉన్న మరో గిన్నెలోంచి కాసిని పాలు పోసి, కాస్త పంచదార కలిపి, రెండు మట్టి పిడతల్లో పోసి ముందు పెట్టాడు.

పప్పు నీళ్ళొక్కటే అయితే సరిపెట్టుకొనే వాడేమో కాని, గుడ్లు కూడా ఉడుకుతూండడం వల్ల ఆ టీ తాగడానికి మనసొప్పలేదు భరతన్‌కి.

డ్రైవర్ సర్కార్, "సాబ్ తాగండి ఫర్వాలేదు. బాగానే ఉంటుంది!" అన్నాడు.

భరతన్ తన ముందున్న మట్టి పిడతని కూడా సర్కార్ ముందుకు తోశాడు.

అదంతా చూసిన హోటలతను భరతన్ దగ్గరగా నిల్చుని అన్నాడు :

"సార్, నా పేరు పాండురంగ్ బోస్. మీరెందుకు టీ తాగట్లేదో అర్థం చేసుకోగలను. కాని ఏం చెయ్యమన్నారు? ఇక్కడికి అర కిలోమీటరు దూరంలో ఉన్న నుయ్యే ఈ హోటలుక్కావలసిన నీటికి ఆధారం. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం నాలుగేసి కావిళ్ళ నీళ్ళు మోసుకొస్తాను.

"చాలామంది లారీ డ్రైవర్లు ఈ మధ్యాహ్న సమయంలో ఇక్కడ భోజనం చేస్తారు. ఈ సమయంలో టీ కావాలని ఎవరడిగినా పప్పు నీళ్ళతోనో, అన్నం ఉడుకుతున్న నీళ్ళతోనో చేస్తాను. రుచికీ, రుచీ, ఆరోగ్యానికి ఆరోగ్యం. నాకు నీళ్లకీ, నిప్పులకీ ఆదా! నా హోటల్లో మంచినీళ్ళతో కలిపిన 'టీ' కావాలంటే ఉదయం పూటా, సాయంత్రం వేళ మాత్రమే దొరుకుతుంది. మీకిప్పుడు మంచి నీళ్ళతో చేసిన టీ కలపాలంటే వండుతున్న వాటిని పక్కగా పెట్టాలి. నా హోటలు దగ్గర ఆగి లోపలికి వచ్చినవారు ఏమీ తీసుకోకుండా వెడ్తే నాకు బావుండదు. అయిస్ బాక్స్‌లో మిస్టీదహీ (తియ్య పెరుగు) ఉంది. తీసుకొస్తాను" అంటూ ఓ మట్టి పాత్రలో తియ్యటి గడ్డ పెరుగు తీసుకొచ్చి భరతన్ ముందు పెట్టాడు.

పాండురంగబోస్ వాటర్ మేనేజ్‌మెంట్‌కి ఆశ్చర్యపోతూ భరతన్ అడిగాడు, – "అన్నం తిన్న ప్లేట్లనీ, ఎంగిలి గ్లాసుల్నీ ఎలా కడుగుతావు?"

"ఇదివరకు మీ దక్షిణాది హోటళ్ళలో అరిటాకులు వాడేవారు. నేను అడ్డాకులతో చేసిన కంచం దొప్పల్లో భోజనాలు పెడ్తాను. మంచినీళ్ళకి మట్టి పిడతలు. అదనంగా ఓ పాతిక పైసలు తీసుకొంటాను" అన్నాడు బోస్.

రైల్వే ఫ్లాట్ ఫారాల మీదా, రోడ్ల పక్క నుండే టీ దుకాణాల్లోనూ, చెరుకు రసం బడ్డీల్లోనూ ఎంగిలి కప్పుల్నీ, గ్లాసుల్నీ ఒకే ఒక్క బాల్చీ నీళ్ళలో రోజంతా ముంచుతూ తీసే నీళ్ళ మేనేజ్‌మెంట్‌కీ, పరిశుభ్రత కనిపించే పాండురంగబోస్ మేనేజ్‌మెంట్‌కీ చాలా తేడా కనిపించింది.

భరతన్ మళ్ళీ ప్రస్తుతానికి వచ్చి ఆలోచించసాగాడు.

నివాస స్థానాల్లోనే నీళ్లందని రోజుల్లో నడిబజార్లలోనూ, ఊర్ల మధ్య దూరాల్లోనూ సామాన్య ప్రజానీకానికీ, ప్రయాణీకులకీ మంచి నీటి వసతులు ఎలా సాధ్యమౌతాయి? చలివేంద్రాలు కొండెక్కిపోయి, లీటర్ నీళ్ళతో ఉన్న ప్లాస్టిక్ సీసాలు పది నుండి పన్నెండు రూపాయలు దాకా అమ్మబడుతున్నాయి! ప్రాణాధారమైన నీటిని అమ్ముకొంటూ, జీవనాధారంగా చేసుకొనే పరిస్థితి ఎందుకొచ్చింది?

రాష్ట్రాల మధ్య నదీ జలాల తగువుల వల్ల ఇటు కాలవలకీ, తద్వారా అటు జలాశయాలకీ మంచినీటి సరఫరా దెబ్బతింటోంది. పంట కాల్వలు, మంచినీటి కాల్వలు తగినంత శ్రద్ధ

లేకపోవడం మూలాన మురుగు కాల్వలుగా మారిపోతున్నాయి. నానాటికీ నీరు కలుషితమైపోయి చివరకు స్నానం చెయ్యడానికి కూడా పనికి రాకుండా పోయే పరిస్థితి తరుముకొస్తోంది. దీంట్లో ప్రభుత్వం బాధ్యత ఎంత? నానాటికీ పెరిగిపోతున్న ప్రజల బాధ్యత ఎంత?

నుదుట రూపాయి కాసంత బొట్టు పెట్టుకొని, కంజీవరం పట్టుచీర మామిలా కట్టుకొని నిల్చున్న తల్లి కేసి, సోఫాలో లుంగీ కట్టుకొని కూర్చున్న తండ్రి కేసి చూశాడు. ఎనమండుగురు బిడ్డల్ని కన్నతల్లిదండ్రులు! ప్రస్తుతానికి యిద్దరక్కలు వివాహాలయి బయటకు వెళ్ళినా, యింట్లో ముగ్గురు కోడళ్ళు అడుగుపెట్టారు. అన్నలిద్దరికీ యిప్పటికే ఒక్కొక్కరికీ ముగ్గురేసి పిల్లలు! తనకో కూతురు. రేపు వసంతకి పెళ్ళయి బయటకు వెళ్ళినా, తమ్ముళ్లిద్దరికీ పెళ్ళిళ్లయి మరో యిద్దరు కోడళ్ళు వస్తారు. వారికి సంతానం కలుగుతుంది. తన తల్లిదండ్రుల్ని కేంద్రంగా తీసుకొంటే, ఒక తరంలో ఎనిమిది మంది అదనం. తరువాతి తరంలో అయిదుగురు కొడుకులకీ కలిగిన సంతానాన్ని కలిపితే, కోడళ్ళతో సహా మొత్తం కుటుంబ సభ్యుల సంఖ్య పాతికపైగా పెరుగుతుంది. అదీ ఒక్కొక్కరూ ముగ్గురికన్నా ఎక్కువ కనకుండా ఉంటేనే!

ఈ మాటు తను అమెరికా వెళ్ళి తిరిగి వస్తే ఆరు పెట్టెల నిండా కానుకలు తీసుకురావాలి. తీసుకురావచ్చు. కాని, తన కుటుంబ సభ్యులు ఒకే యింట్లో ఉన్నా, వేర్వేరు యిళ్ళలో కాపురమున్నా నీటి అవసరం నిత్యం ఉంటూనే ఉంటుంది. పెరుగుతోనే ఉంటుంది. అయితే తరుగుతున్న నీటి వనరులతో, పెరుగుతున్న జనాభాతో పరిస్థితి విషమిస్తోందని ఎవరూ ఆలోచించట్లేదు.

వెయ్యి మందికి రూపొందించిన ఊరి మంచి నీటి ప్రణాళిక రూపొందేసరికి మూడు వేల మంది తయారవుతున్నారు. ఒక ఊరి సంగతీ, ఒక నగరం సంగతీ యింతే అయితే, తాలూకా, జిల్లా, రాష్ట్ర, దేశం సంగతి మరోలా ఎలా ఉంటుంది?

భరతన్ ఆ రాత్రి అన్నలిద్దరికీ నచ్చచెప్పి, మర్నాడుదయం వారితో సహా హాస్పిటల్‌కి వెళ్ళాడు. వాళ్ళతోపాటు తనూ ఆపరేషన్ బల్ల ఎక్కాడు, ఉన్న ఒక్క కూతురూ చాలనుకుంటూ.

●

'భయాందర్' ముంబయ్ మహానగరపు పశ్చిమ శివార్లలోని ఓ ప్రాంతం. జనాభా ఏడు లక్షలు. నిరంతర నీటి సమస్యతో విసుగెత్తిన జనాలు *1999* మార్చి మొదటి వారంలో తీవ్ర నిరసన తెలియజేశారు. అవకాశవాదులైన రాజకీయ నాయకులూ, దుండగులూ రంగంలోకి దిగడంతో బస్సులు దగ్ధమయ్యాయి. రైల్వే సామాగ్రి తగలబడింది. నీళ్ల టాంకర్ల యాజమానులకీ, అధికారవర్గంలోని వారికీ మధ్య ఉన్న లావాదేవీల మూలాన, ఈ నీటి సమస్య అలాగే కొనసాగుతోందని కొందరి ఉవాచ. రాజకీయాలతో రంగులు పులుముకొన్న ఈ సమస్య రోజుకోవిధంగా పత్రికల్లో తలెత్తుతోంది. మహానగరపు జలాశయాల సంఖ్య అంతే ఉండగా, భయాందర్ లాంటి అనేక జనారణ్యాల సంఖ్య పెరిగిపోతోంది. ఇందులో ప్రభుత్వం బాధ్యతని ప్రశ్నించే వారే కాని, ప్రజలెంతవరకూ బాధ్యులని ఆలోచించేవారు లేరు.

– రచయిత